క్లుప్తంగా

'సూపరింటెండెంట్‌ను రిలీవ్ చేయండి'

ఖానాపూర్: డీఈవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించే భోజన్నను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా పదో తరగతి పరీక్ష పేపర్లు దిద్దేందుకు డీఈవో విధులు కేటాయిస్తున్నారని ఆరోపించారు. నిబంధనల మేరకే పది పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ చేయాలని కోరారు. వరంగల్ ఆర్జేడీ చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



శిబిరం ప్రారంభిస్తున్న సర్పంచ్ చంద్రకళ

తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో కంటివెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచ్ కాంతల చంద్రకళ ప్రారంభించారు. కంటిపరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి అద్దాలు అందిస్తామన్నారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, పోతారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఉత్తం బాలేరావ్, శ్రీనివాస్‌రెడ్డి, వైద్యసిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న టీచర్

కడెం: మండలంలోని లింగాపూర్ మూడో అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించి పోషకాహారం అందేలా చూడాలని తల్లులకు సూచించారు. స్థానిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ విజయనిర్మల తదితరులు ఉన్నారు.

బాసర మున్నూరుకాపు సంఘ సమావేశం

భైంసా: బాసర మండలం కిర్గుల్ మున్నూరుకాపు సంఘ భవనంలో బుధవారం బాసర మండల సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండలాధ్యక్షుడు రోల్ల రమేశ్ హాజరై కిర్గుల్ గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు. అనంతరం పలు అంశాలు చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం తాలూక ఉపాధ్యక్షుడు జంగం రాజేందర్, మీడియా కన్వీనర్ కోర్వ శ్యామ్, సభ్యులు అంబటి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి జంగం రమేశ్, ఉపాధ్యక్షులు రావుల భోజన్న, సహా కార్యదర్శి భైరశెట్టి సంజీవ్, సభ్యులు కొత్తపేట రత్నాకర్, బాసర వీడీసీ సభ్యులు రాజేందర్, రాములు, కిర్గుల్ గ్రామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు పెంచాలి

కుంటాల: నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా బాధ్యతగా పెంచాలని సర్పంచ్ సమత సూచించారు. బుధవారం కుంటాలలోని నర్సరీని వారు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి రాజాబాపు, వెంకటేశ్ తదితరులున్నారు.

వాహనాలు తనిఖీ

ముధోల్: మద్యం సేవించి వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై సాయికిరణ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే ఆటోడ్రైవర్లపై చర్యలు తప్పవన్నారు.

'ప్రశ్నార్థకంగా నిరుద్యోగుల బతుకు'



మాట్లాడుతున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా నిరుద్యోగుల బతుకు ప్రశ్నార్థకంగా మారిందని వైఎస్సార్‌టీపీ ఖానాపూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ లోకిని రాము అన్నారు. ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు టీ-సేవ్ పేరిట ఐదు రోజుల కార్యక్రమం ముగింపులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు టీ-సేవ్ కార్యక్రమం ద్వారా పోరాడుతామని పేర్కొన్నారు. జిల్లా యూత్ అధ్యక్షులు శ్రీపాద శేషాద్రి, పట్టణ అధ్యక్షులు పానుగంటి నరేశ్‌కుమార్, యూత్ మండలాధ్యక్షులు ఎగుర్ల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరికి తెగులు.. మళ్లీ గుబులు

- దిగుబడిపై రైతుల ఆందోళన
- మొదట్లో మొగిపురుగు..పొట్టదశలో మెడవిరుపు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న అధికారులు



గొడిసెరాలో మెడ విరుపు సోకడంతో తాలుగా మారిన వరి కంకులు

లోకేశ్వరం: పొట్టదశకు చేరిన వరి పంటను మెడ విరుపు తెగులు సోకుతుండటంతో దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం గింజ దశలో ఉన్న పంట మరో 15 రోజుల్లో చేతికి వస్తుంది. కాని ఈ సమయంలోనే పంటను మెడవిరుపు తెగులు ఆశిస్తుండటంతో ఏం చేయాలో తెలియడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వానాకాలంలో అధిక వర్షాలతో పంట నష్టపోయామని.. ఈసారైనా తమ అప్పులు తీరుతాయనుకుంటే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొగిపురుగు సోకడంతో తాలుగా మారుతున్న గింజలు ..

జిల్లాలో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండటంతో రైతులు యాసంగిలో సుమారు 92వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. వరినాట్లు వేసిన నెల నుంచే పంటకు తెగుళ్లు ప్రారంభమయ్యాయి. మొదట్లో అగ్గితెగులు, తర్వాత మొగి పురుగు సోకడంతో పంట ఆశించినంతగా పెరగలేదు. ఎలాగో సస్యరక్షణ చర్యలు పంటను కాపాడుకున్నారు. కాని ఇప్పుడు పొట్టదశకు చేరిన పంటకు మెడవిరుపు తెగులుతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మొగి పురుగుతో వరి కంకులు తెల్లగా మారుతున్నాయి. గింజ తాలుపోతోంది.

అవగాహన కల్పిస్తే మేలు..

వరి పంటను ఆశిస్తున్న మెడవిరుపు తెగులు నివారణపై వ్యవసాయాధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాలని రైతులు వేడుకుంటున్నారు. ఇప్పటికే ఈ తెగులు నివారణకు రూ.వేలు ఖర్చు చేసి క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తున్నా.. ప్రయోజనం ఉండటం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

ఆరు ఎకరాల్లో సోకింది



యాసంగిలో పది ఎకరాల్లో వరి పంట సాగు చేశా. ఆరు ఎకరాల్లో పంటకు మెడ వి రుపు తెగులు సోకడంతో కంకులు తెల్లగా మారుతున్నాయి. మందులు పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. దిగుబడి తగ్గుతుందని భయంగా ఉంది. పెట్టుబడులు వచ్చే చాలన్నట్లుగా ఉంది పరిస్థితి. – పోశెట్టి, కన్కపూర్, రైతు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పంట పొట్ట దశలో ఉండి, పచ్చగా ఉంటేనే మెడ విరుపు తెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పొలం ఎండే దశలో ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండదు. తమ పొలాలకు మొగిపురుగు సోకితే రైతులు వెంటనే సమీపంలోని ఏఈవోలను సంప్రదించాలి. మొత్తం పంటలో దాదాపు 20 శాతం ఈ తెగులు కనిపిస్తోంది.

– అంజిప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి

పథకాల అమలులో కార్యదర్శులే కీలకం

మామడ: గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో పంచాయతీ కార్యదర్శులే కీలకమని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలో 21 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నాలుగేళ్ల సర్వీస్ పూర్తి చేసుకోవడంతో మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీఓ గోవర్ధన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కుంటాల: నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్తు కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వం తమను రెగ్యులరైజ్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆప్క గజ్జారాం యాదవ్, ఎంపీవో రహీం, వైస్ ఎంపీపీ మానిక నవీన్, ఏపీవో గట్టుపల్లి నవీన్, సారిక, దేవన్న తదితరులు పాల్గొన్నారు.



కుభీర్‌లో కేక్ కట్ చేస్తున్న కార్యదర్శులు

కుభీర్: నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. తమ ప్రొహిబిషన్ కాలం పూర్తయినందున రెగ్యులరైజ్ అంశం ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వైస్ ఎంపీపీ మోహినొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఔట్‌సోర్సింగ్ కింద పని చేస్తున్న కార్యదర్శులను సైతం రెగ్యులర్ చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, చవాన్ శంకర్, కార్యదర్శుల సంఘం మండలాధ్యక్షుడు విజయ్, కిరణ్ తదితరులు ఉన్నారు.

జాబ్‌కార్డులుంటేనే పనులకు రావాలి

ముధోల్: జాబ్‌కార్డులుంటేనే కూలీలు ఉపాధి పనులకు రావాలని ఏపీడీ ఓస ప్రసాద్ అన్నారు. బుధవారం వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా తరోడ గ్రామంలో కూలీలతో మాట్లాడారు. జాబ్ కార్డులు లేని వారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. ప్రసుత్తం చెరువులో పూడికతీత పనులు, ముళ్లపొదలు తొలగించడం, గుంతలు తవ్వడం వంటి పనులు సాగుతున్నాయన్నారు. ఎండలు పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఉదయమే వెళ్లి పనులు త్వరగా ముగించుకోవాలని సూచించారు. ఏపీవో శిరీష, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ ప్రసాద్

కూలీలకు తాగునీటి సౌకర్యం

లోకేశ్వరం: మండలంలోని కిష్టాపూర్‌లో బుధవారం ఉపాధిహామీ కూలీలకు పీఏసీఎస్ డైరెక్టర్ సుధీర్‌రెడ్డి పని ప్రదేశంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. వారి వెంట కూలీలు ఉన్నారు.

ఉపాధి పనులు వేగవంతం చేయండి

మామడ: గ్రామాల్లో స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం మరింత పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్ కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన సర్వేలో నమోదు చేసిన పచ్చదనం, పరిశుభ్రత, పల్లెప్రకృతివనం, నీటిసంరక్షణ, విద్య, వైద్యం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా చేపట్టాల్సిన అంశాలను గుర్తించారు. ఎంపీవో గోవర్ధన్, ఈజీఎస్ ఏపీవో శివాజీ, ఐకేపీ ఏపీఎం అరుణ, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

దస్తురాబాద్: ఉపాధిహామీ, పల్లెప్రగతి పనులను వేగవంతం చేయాలని ఎంపీవో అనిల్‌కుమార్ కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో కూలీలకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఉపాధిహామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య పెరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేశ్

బీజేపీతోనే దళితుల అభివృద్ధి

- దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్
- ఈనెల 14నుంచి అంబేద్కర్ జయంతి ఉత్సవాలు

నిర్మల్‌చైన్‌గేట్: దళితుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళిత మోర్చా జాతీయ అధ్యక్షులు లాల్ సింగ్‌ఆర్య ఆదేశాల మేరకు ఏప్రిల్ 14 నుంచి మే 5 బుద్ధ జయంతి వరకు అంబేద్కర్ జయంతి ఉత్సవాలను దళిత మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఉత్సవాల్లో భాగంగా బైకు ర్యాలీలతో వెళ్లి అంబేద్కర్ విగ్రహాలను శుభ్రపరచడం, రెండో రోజు నుంచి వరుసగా అంబేద్కర్ జీవితంపై సంగుష్టి, ఎస్సీ హాస్టళ్ల సందర్శన, ఎస్సీ ప్రముఖుల సన్మానం, ప్రభుత్వ వైద్యశాలలో పండ్ల పంపిణీ, ఎస్సీ బస్తీల్లో స్వచ్ఛభారత్, అంబేద్కర్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు, ఎస్సీ కళాకారులకు సన్మానం, ఎస్సీబస్తీల్లో వైద్య శిబిరం, పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం, ఎస్సీ మహిళా సమ్మేళనాలు, ఎస్సీ యువకుల సమ్మేళనాలు, ఎస్సీ లబ్ధిదారుల సమ్మేళనాలు, ఎస్సీ బస్తీల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన, ఎస్సీ మేధావుల సన్మానం, ఎస్సీ ఉప కులాల్లో సూచి తయారీ వంటి కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిసమ్మె రాజు, అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఉంగరాల రాజు, చేరికల కమిటీ చైర్మన్ భూపతిరెడ్డి, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి భాస్కర్, పట్టణ కార్యదర్శి నాగేంద్ర పాండే, నర్సయ్య, అఖిలేశ్‌రెడ్డి ఉన్నారు.



మాట్లాడుతున్న రాచకొండ సాగర్

పరామర్శ

కుంటాల: కుంటాలకు చెందిన సిర్ల రాకేశ్ ఓ రోడ్డు ప్రమాదంలో గాయపడగా గ్రామానికే చెందిన పిట్ల గజ్జారాం మృతి చెందారు. బుధవారం బాధిత కుటుంబసభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు జీవీ రమణరావు పరామర్శించారు. వారి వెంట గ్రామపెద్దలు సిర్ల చిన్నన్న, కుమ్మరి గజేందర్, రాజు తదితరులున్నారు.

ఎస్సైకి సన్మానం

కుంటాల: మండల ఎస్సైగా హన్మాండ్లు ఇటీవల బాధ్యతలు స్వీకరించగా బుధవారం కుంటాల సర్పంచ్ సమత వారిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటేశ్, కుమ్మరి రమేశ్, బోనిగిరి రవికుమార్ తదితరులున్నారు.

ఆర్టీసీ సేవలపై అవగాహన

లక్ష్మణచాంద: లాభం రాకున్నా ప్రజల అభీష్టం మేరకు ఆర్టీసీ బస్సులు నడుపుతున్నామని నిర్మల్ డిపో మేనేజర్ సాయన్న పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మునిపెల్లి గ్రామంలో ఆర్టీసీ సేవలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సురక్షిత ప్రయాణం కోసం ప్రైవేటు వాహనాల్లో కాక ఆర్టీసీ బస్సుల్లో వెళ్లాలని సూ చించారు. ప్రజలు కోరితే గ్రామానికి మరిన్ని బస్సు ట్రిప్పులు నడుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బస్‌పాసులు అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామంలో బుధవారం దివ్యాంగులకు రాయితీ బస్‌పాసులను ఆర్టీసీ అధికారులు అందజేశారు. ఆధార్, సదరమ్ సర్టిఫికెట్‌తో వస్తే రాయితీ బస్‌పాస్‌లను అందిస్తామని.. సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ అధికారులు రమణ, నర్సయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

'నాసికరంగా రోడ్ల నిర్మాణం'

దస్తురాబాద్: మండలంలోని బుట్టపూర్ పంచాయతీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాసిరకంగా చేపట్టారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బొమ్మెన సురేశ్ ఆరోపించారు. బుధవారం బుట్టాపూర్‌లోని బీసీ కాలనీలో ఇటీవల నిర్మించిన సీసీరోడ్డును పరిశీలించి మాట్లాడారు. నాసిరకం కంకర, సిమెంట్ కలపడంతో రోడ్డుకు పగుళ్లు వస్తే మళ్లీ సిమెంట్ వేశారన్నారు. రోడ్డుకు నీరు పట్టేందుకు మట్టికుంటలు ఏర్పాటు చేయలేదన్నారు. అధికారులు కమీషన్లకు అలవాటు పడి పరిశీలించకుండానే బిల్లులు తయారు చేశారన్నారు. పనులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఎం గ్రామ కార్యదర్శి రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

సీఐని కలిసిన పాత్రికేయులు

లక్ష్మణచాంద: సోన్ సీఐ నవీన్‌కుమార్‌ను తన కార్యాలయంలో లక్ష్మణచాంద మండల పాత్రికేయులు కలిశారు. ఈ సందర్భంగా సీఐని శాలువాతో సన్మానించి పూలమొక్క అందించారు.

అటెన్షన్ ప్లీజ్.. వాహనదారులూ.. జర భద్రం



లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండా ఎక్స్‌రోడ్డు నుంచి లక్ష్మినగర్ తండా వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి సమస్య మరింత తీవ్రమైంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రఘువంశీ, పీఆర్ ఏఈ, లోకేశ్వరం, ఫోన్: 95506 07360

ఈరోజు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

లోకేశ్వరం: మండలంలోని మన్మద్, పిప్రి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెక్కులు పంపిణీ

సారంగపూర్: మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తారని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు ఓ ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు, మండలంలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

వైద్యశిబిరం

కడెం: మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో గురువారం భవన నిర్మాణ కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు భుక్య రమేశ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిన్నక్యాంప్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ అనుబంధ సంస్థ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరాన్ని కడెం, దస్తురాబాద్ మండలాలకు చెందిన భవన నిర్మాణ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చే కార్మికులు తమ లేబర్ కార్డు తీసుకురావాలని కోరారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	10
వంకాయ	40
బెండకాయ	40
పచ్చిమిర్చి	50
కాకరకాయ	50
బీరకాయ	60
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా
నారాయణ: బలగం

మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఖానాపూర్: మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. పట్టణంలోని ముస్లింల ఈద్గా కోసం ప్రభుత్వం రెండెకరాలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎమ్మెల్యేను తన నివాసంలో సన్మానించారు. అనంతరం మండలంలోని పాతఎల్లాపూర్ వద్ద యూటీ(సదర్మాట్ అండర్ టన్నెల్) మరమ్మతులకు భూమిపూజ చేశారు. అంతకముందు పట్టణంలోని పదో వార్డులో కంటివెలుగు శిబిరం ప్రారంభించారు. అక్కడి నుంచి బావాపూర్(కే) గ్రామానికి వెళ్లి పలువురిని పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో అంకం రాజేందర్, పుప్పాల శంకర్, రామునాయక్, ఖలీల్, వెంకాగౌడ్, శ్రీనివాస్, సురేశ్, రాజేశ్వర్, కేహెచ్‌ఖ్ ఖాన్, మోహిన్, సర్జిల్, షోయబ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు



పశువులతో పరేషాన్



ఖానాపూర్: పట్టణంలో పశువులు రాత్రనక, పగలనక రోడ్లపైనే సంచరిస్తున్నాయి. ఒక్కసారిగా మీదకు రావడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మున్సిపల్ సిబ్బంది పలుమార్లు హెచ్చరించినా పశువుల యజమానులు పట్టించుకోవడం లేదు. దీనికి తోడు రోడ్డు వైడెనింగ్ పనులతో ఇక్కట్లు రెండింతలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు వేడుకుంటున్నారు.

వార్షిక పరీక్షలు ప్రారంభం

దస్తురాబాద్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈనెల 20న పరీక్షలు ముగుస్తాయని ఉపాధ్యాయులు తెలిపారు.